# మానవ పరిణామమే విశ్వపరిణామము

**లోని శత్రువులకు లొంగిపోయినవాడు**
**బయటి రిపులనెట్లు పట్టగలడు?!**
**తత్త్వమెరిగినంత ధన్యుడౌ నరుడిలన్**
**ఉన్నమాట తెలుపుచున్నమాట**

ప్రేమస్వరూపులారా!

మానవ పరిణామమే విశ్వపరిణామము. మనిషి మారినప్పుడే ప్రపంచము మారగలదు. వ్యక్తి మారినప్పుడే సమాజముకూడను మారగలదు. భౌతిక పరివర్తనతోపాటు మానసిక పరివర్తన, మానసిక పరివర్తనతోపాటు ఆధ్యాత్మిక పరివర్తన అత్యవసరము. ఎందరో తత్త్వవేత్తలు, మహనీయులు, పండితులు, సాధువులు ఎంతో కాలమునుండి భగవత్ తత్త్వమును ప్రచారప్రబోధలు సలుపుచున్నారు. కేవలము వ్యాఖ్యాన సంబంధమైన ప్రచార, ప్రబోధలు సల్పుతున్నారు. ఆచరణరూపమైన ప్రచార, ప్రబోధలు సలుపటంలేదు. ఆచరణ రూపమైన ప్రచార ప్రబోధలే యీనాడు అత్యవసరము.

**దివ్యత్వమును గుర్తించవలెనన్న మత గ్రంథములలోని పవిత్రమైన అంతరార్థమును తెలుసుకోవటం అత్యవసరము**

ఒక్కొక్క మతమువారు ఒక్కొక్క గ్రంథమును ప్రధానమైన లక్ష్యమునందుంచుకొని, ప్రమాణముగా స్వీకరించి ప్రపంచమునందు ప్రచారము సల్పుతున్నారు. క్రిష్టియన్ మతము బైబిలును ప్రధాన ప్రమాణముగా విశ్వసిస్తూ వచ్చింది. ముస్లిములు ఖురాన్‌ను ప్రధానమైన, ప్రమాణమైన గ్రంథముగా విశ్వసిస్తూ దానిని అనుసరిస్తూ వచ్చారు. సిక్కులు గ్రంథసాహిబ్‌ను ప్రాణసమానముగా విశ్వసించి, ప్రమాణముగా తాము అంగీకరించి,

sri sathyasaivachanamrutam

ప్రచార ప్రబోధలు సలుపుతూ వచ్చారు. భారతీయులయొక్క గ్రంథములు వేదశాస్త్ర యితిహాస పురాణములయొక్క ప్రమాణములను విశ్వసించినప్పటికిని భగవద్గీతనే ప్రధానమైన ప్రమాణముగా స్వీకరించి యీనాడు లోకమునందు అధికముగా ప్రచారము సలుపుతూ వస్తున్నారు. ఈ భగవద్గీత సంబంధమైన విషయములలో మనము అతి జాగ్రత్తగా విచారించి దానిని సరైన ఆచరణయందుంచి సక్రమమైన మార్గములో అనుభవించాలి. ప్రతిగ్రంథముయొక్క అంతరార్థాన్ని గుర్తించి వర్తించినప్పుడే యీ గ్రంథముయొక్క సారముకూడను కొంత మనము అనుభవించుటకు వీలవుతుంది. ఈనాడు ప్రామాణిక గ్రంథములన్నిటినికూడను కేవలము పారాయణలయందును, పఠనలయందును వినియోగించుచున్నారే కాని వాటి అంతరార్థమును గుర్తించి తమతమ జీవితములలో మార్పు తెప్పించుకొనుటలేదు. సమస్త గ్రంథములుకూడను పరతత్త్వమును బోధించేవేకాని పారాయణతో సరిపెట్టుకునేవి కావని గుర్తించాలి. భగవద్గీత కేవలము ఒక్క భారతీయులకు మాత్రమే సంబంధించినదని, యిది భారతీయ ప్రచార, ప్రమాణ సంబంధమైన గ్రంథమని విశ్వసించటము ఒక సంకుచితమైన భావమే! ఇది దేశకాలపాత్రలకు అతీతమైన గ్రంథము. ఇది జాతిమతకులములకు అతీతమైన గ్రంథము. ఇది అద్వైతసారముతోకూడిన గ్రంథము. తత్త్వజ్ఞానముతోకూడిన గొప్ప పుస్తకము. ఇది సర్వ స్వరూపమైన సర్వోపనిషత్ సారమైనది. ఈ రసమును గ్రోలినవాడు ధీరుడు, వీరుడు కావలెనేకాని, భీరుడు, దీనుడు కారాదు. కాని, దీనియొక్క అంతరార్థమును గుర్తించుకొనలేక పెద్దలు కేవలము ప్రచార, ప్రబోధలచేత గ్రంథ విషయమును మాత్రమే ప్రబోధిస్తూ వస్తున్నారు. ఈ జిజ్ఞాసులు భ్రమసహితులు మాత్రమే! కాని, భగవద్గీత వ్యక్తిని భ్రమరహితుని గావించాలి. ఈ జాతి, మత భేదములన్నియు కొన్ని భ్రమలకు సంబంధించినవి. భ్రమలకు అతీతమైనది గీత. గుణములద్వారా వెలువడినవే యీ భ్రమలు. గుణాతీతుడు భగవంతుడు. కనుక దైవత్వాన్ని గుర్తించవలెనన్న, దివ్యత్వాన్ని మనము చేరవలెనన్న పవిత్రమైన అంతరార్థాన్ని తెలుసుకోవటం అత్యవసరము.

**అహంతత్త్వమనేది సర్వభూతములయందు అంతర్భూతమైయున్న దివ్యతత్త్వమే!**

sri sathyasai vachanamrutam

'ఏకోవసి సర్వభూతాంతరాత్మ' అనే సారాన్ని ఆధారముగా తీసుకున్నప్పుడు ఒకే భగవంతుడు సర్వులయందును ఆత్మస్వరూపుడై వుండగా నేను, నేను, నేను అనే విచారణ సల్పినప్పుడు, నేనుగా బయలుదేరిన నేనే నేను అనే సత్యాన్ని గుర్తించటము అవసరం. కనుక యీ అహంతత్త్వమనేది సర్వభూతములయందు అంతర్భూతమైవున్న దివ్యతత్త్వమే! కేవలము భగవద్గీతను మాత్రమే మనము భగవద్గీతయని భావించరాదు. భగవంతుని గురించి చెప్పే గ్రంథములన్నియు భగవద్గీతలే! సమస్త మతగ్రంథములు భగవంతుని గురించియే బోధించుచున్నవి. కనుక, అన్నియు భగవద్గీతలుగానే మనము విశ్వసించాలి. ఇట్టి అనేకత్వములోని యేకత్వమును మనము గుర్తించినప్పుడే దివ్యత్వమైన ఆత్మతత్త్వము మనకు అర్థమవుతుంది. కేవలము సంకుచిత భావములచేత కులము, మతము, వర్ణము యిలాంటి భేదములందు మనము జీవితాన్ని వ్యర్థము గావించుకోరాదు. తత్త్వజ్ఞానముతో కూడినదే యీ భగవద్గీత. తత్త్వము అనగా ఏమిటి? త్వం అనగా జీవస్థానముతో కూడనది. తత్ అనేది ఈశ్వరస్థానముతోకూడినది. కనుక జీవతత్త్వముతోకూడిన 'త్వం'ను ఈశ్వరత్వముతోకూడిన 'తత్'కు చేరినప్పుడే యిది 'తత్త్వం' అవుతుంది. ఏతావాతా, జీవేశ్వర సమ్మిళితమైన జ్ఞానమే భగవద్గీత అనే తత్త్వ జ్ఞానము. ప్రకృతి, పరమాత్మలయొక్క చేరికయే తత్త్వజ్ఞానము. ఆత్మ, అనాత్మలయొక్క చేరికయే తత్త్వజ్ఞానము. ఇట్టి విశాలమైన పవిత్రమైన గ్రంథమును మనము సంకుచితమైన భావములచేత కేవలం ఆరాధనకు పరిమితం చేస్తూ వస్తున్నాము.

**భగవద్గీతను ఆచరణ రూపముగా అనుభవించాలి**

ఈ గీతయొక్క సారమును ఆచరణరూపముగా అనుభవించవలెనుగాని కేవలము పారాయణలయందు, ప్రబోధలయందు కాలం గడుపటం అపమార్గముగా వుంటుంటాది. ఈ పవిత్ర గ్రంథముయొక్క నిజతత్త్వాన్నికూడను మనము కొంతవరకు గుర్తించాలి. భగవద్గీతను తెరిచిన తక్షణమే ధృతరాష్ట్ర ఉవాచ, కృష్ణ ఉవాచ, అర్జున ఉవాచ, సంజయ ఉవాచ అని కేవలము కృష్ణార్జునులు దేహధారులుగా భావించి మనము పఠిస్తున్నాము. ఈ విధముగా కృష్ణార్జులను దేహధారులుగా భావించి భగవద్గీతను యెంతకాలము

sri sathyasai vachanamrutam

పారాయణము, ప్రచారము సలిపినప్పటికి యేమాత్రముకూడను మనము దైవతత్త్వాన్ని అనుభవించలేము. కృష్ణార్జునులు జీవేశ్వరుల స్వరూపకముగా మనము భావించాలి. ఇక్కడ, అర్జుననకుకూడను భ్రమ సంభవించిందా యుద్ధభూమిలో ప్రవేశించినప్పుడు. "ఇందరు బంధు, మిత్ర, గురుపుత్రులను జంపి భరించుటెట్లులో! నాకన్నులు తిరుగుచున్నవి. యింక కాలము కదుపక కదలు మింటికిన్" అన్నాడు, కృష్ణునితో. కేవలము బంధుమిత్రులను చూచి తనకు భ్రమ కలిగింది. ఈ భ్రమ మమత్వముతోకూడినది. ఈ మమత్వము అభిమానముతో చేరినది. అభిమాన, మమకారములచేతనే యీ భ్రమ సంభవించింది. ఈ విధమైన భ్రమ సంభవించినప్పుడు అర్జునునకు కృష్ణుడు ఏమి చెప్పాడు? 'అర్జునా! భ్రమ వుండినంతవరకు బ్రహ్మను చూడలేవు. బ్రహ్మను చేరలేవు' అని చెప్పి భ్రమనుండి విరక్తి గావించాడు. భయమును నిర్మూలము చేశాడు. బ్రహ్మ తత్త్వాన్ని నిరూపింపజేశాడు. అప్పుడే దీనుడైన అర్జునుడు ధీరుడుగా, వీరునిగా రూపొందాడు. అర్జునునికి ప్రతినిధులైన జీవులు యీనాడు భ్రమలచేతను, దీనత్వముచేతను కేవలము ఒక అజ్ఞానమునందు మునిగిపోతున్నారు. తమ కర్తవ్యాన్ని విస్మరిస్తున్నారు. మానవత్వమనే సత్యాన్ని కోల్పోతున్నారు. నిర్విరామ కృషిచే, నిరంతర తాపత్రయములచే, అంతులేని ఆశలచే, అర్థముకాని అవేదనలచే అప్రాప్యరూపప్రాప్తికై ప్రాకులాడే మానవునకు శాంతి యేరీతిగా లభిస్తుంది? నిత్యసత్యమైన యీ నిరాకార, నిర్గుణతత్త్వాన్ని గుర్తించటానికి భ్రమను దూరము గావించుకోవాలి. యీ భ్రమను దూరము గావించుకొనే నిమిత్తమై మనము ప్రతి విషయమును ఆచరణలో వుంచటము అత్యవసరము. ఈ భ్రమయే 'మోహము' అని పిలువబడుతూ వచ్చింది. ఈ మోహము కేవలము గుణములచే సంభవించినది. గుణములు కల్పితమైనవి. స్వప్నదృశ్యమువంటి యీ జగత్తును చూచి కొన్ని భయ, భ్రాంతులు యేర్పడుతూ వస్తుంటాయి. ఇవన్నీకూడను దృశ్యకల్పితమైనవే! 'విశ్వం దర్పణ దృశ్యమాననగరీ' అన్నారు. ఈ విశ్వమంతా కేవలము అద్దములో చూచిన ప్రతిబింబముగా కనుపిస్తున్నాది. అద్దములో కనుపించుచున్నదిగానీ, అద్దమునకు సంబంధములేదు. నేత్రమునకు గోచరించుచున్నదిగానీ దీనికి నేత్రముతో యేమాత్రము సంబంధములేదు. నేత్రములు ఎల్లప్పుడు సాక్షీభూతములై వుంటుంటాయి. సమస్త

sri sathyasaivachanamrutam

దృశ్యములను నేత్రములు చూడగలుగుచున్నవి. కాని, నేత్రములు నేత్రములను చూడలేకపోతున్నవి. ఇట్టి అంధత్వమును నిర్మూలనము గావించి, దివ్యత్వమును ప్రాప్తింపజేసి, అనుగ్రహముతో ఆనందాన్ని అనుభవింపజేసేదే యీ భగవద్గీత.

**'తాను తానుగా నిల్చుటమే భగవద్గీతయొక్క సారము'**

ఈనాడు భవగద్గీతయొక్క ప్రచారములు, ప్రబోధములు విరివిగా పెరిగినవి. అనేక విధములైన జ్ఞానయజ్ఞములు, భగవద్గీత సప్తాహములుకూడను విరివిగా జరుగుతున్నవి. అయితే, యివి క్రమక్రమేణా భ్రమలతోకూడిన మానవుని మరింత భ్రమలలో పడవేసి వారిని భ్రష్టులను గావించుచున్నవి. కారణమేమనగా, పవిత్రమైన గీతాసారమునందున్న యథార్థమును వారు బోధించటములేదు. శ్లోకములు కంఠస్థము గావించటము, పారాయణలు సల్పటము, ఉచ్చరించటము; యిది కేవలము ఒక గ్రామఫోను ప్లేటువలె అనుభవిస్తున్నారు. ఇది సరైన పద్ధతి కాదు. గీతయందు వున్న పవిత్రమైన సూక్తి మనము చక్కగా గుర్తించాలి. అర్జునుని నిమిత్తమాత్రంగా పెట్టుకొని బోధించినట్టుగా స్వయంగా కృష్ణుడే చెప్పాడు. 'నిమిత్త మాత్రం భవ సవ్యసాచి', అన్నాడు. "ఓ సవ్యసాచి! నిన్ను నిమిత్తమాత్రంగా పెట్టుకున్నాను. ఈ భగవద్గీత నీకే కాదు, జగత్తు అంతకు సంబంధించినది. నేను సర్వజీవులయందు ఆత్మస్వరూపుడనై వున్నాను. నీవు వేరు, నేను వేరు కాదు. రాగద్వేషములచే కూడటంచేత యథార్థమైన స్వరూపాన్ని నీవు చూడలేకపోతున్నావు. మబ్బులచే కప్పబడిన సూర్యుడు మనకు కనుపించక పోయినంతమాత్రమును సూర్యుడులేడని భావించరాదు. నీవు సత్యాన్ని గుర్తించుకోలేక పోయినంత మాత్రమున సత్యము లేదని నీవు వాదించుట యేమాత్రము మంచిదికాదు" అని బోధించాడు. తనను తాను గుర్తించుకుంటే తానే బ్రహ్మ అయిపోతాడు. తాను తానుగా నిల్చుటమే, భగవద్గీతసారము. తాను జీవుడు, కృష్ణుడు దేవుడు అనే విభాగము మనము చేయరాదు. ఈ భిన్నత్వములోనే మనకు భయ, భ్రాంతులు చేకూరుతాయి. దీనిని యేకత్వము గావించుకొనే తత్త్వాన్ని మనము అర్థము చేసుకోవాలి. ఇది కేవలము ధర్మశాసనము.

sri sathyasai vahini vachanamrutam

**మాయను నిర్మూలము చేసి మాధవత్వాన్ని చేర్చుకునే నిమిత్తము ఏర్పడినదే భగవద్గీత**

భగవద్గీత ధర్మశాసనము. కారణమేమనగా, 'ధర్మాన్ని నిలబెట్టే నిమిత్తము నేను అవతరిస్తున్నాను', అని చెప్పాడు. 'ఎక్కడ ధర్మము క్షీణిస్తుందో, అక్కడంతా నేను అవతరిస్తున్నాను', అన్నాడు. ధర్మమనగా యేమిటి? మానవునియొక్క కర్తవ్యాన్ని గుర్తించి వర్తించేదే ధర్మము. ధర్మము మానవునియొక్క ప్రాణము వంటిది. చక్కెరకు తీపి ఎట్టిదో, పుష్పమునకు సుగంధము యెట్టిదో, మానవునకు ప్రీతి అనేది అట్టిది. ఈ ప్రీతి, నీతి నిజాయతీలతో కూడినదై వుండాలి. కనుక, ధర్మాన్ని గుర్తించుకొనే నిమిత్తమై మనము ధర్మాన్ని ప్రవేశపెట్టాలి. ధర్మాన్ని బోధించటము, ధనాన్ని ఆశించటము ఈ రెండింటికి పొత్తు కుదురుతుందా? ధనముతో కొనేది కాదు, ధర్మము. హృదయముతో కొనవలసినది. ఈనాడు భగవద్గీత ప్రచారములన్నియు వ్యాపార కార్యకలాపములుగా తయారౌతున్నవి. ఈ విధమైన మార్గము యేనాటికి సరైన మార్గముకాదు. మానవత్వమునందున్న భ్రమను మనము చక్కగా విచారణ చేయటానికి ప్రయత్నించాలి. పుట్టినది మొదలు గిట్టునంతవరకు భ్రమలతోనే మనము జీవిస్తున్నాము. ఈ భ్రమనే 'మాయ' అని చెప్పుతూ వచ్చారు. కనుకనే

> **బ్రతుకులన్నియు మాయ**
> **భవ బంధములు మాయ**
> **సంసారమది మాయ చావు మాయ**
> **మాయ బ్రతుకుకింత మాయలో పడనేల?**

మాయ బ్రతుకునకే మాయలోపడుతున్నాము, మనము. మాయను నిర్మూలము చేసి మాధవత్వాన్ని చేర్చుకునే నిమిత్తము యేర్పడినదే యీ భగవద్గీత. మానవుడు మానవుడుగా బ్రతికి మాధవత్వముగా మారేదే వేదాంతముయొక్క సారము.

**భగవద్గీత ఆచరణ రూపమైన గ్రంథము**

తరతరములనుండి యీ భగవద్గీత పారాయణము చేసేవారు కోటానుకోట్లు గలరు.

srisathyasaivachanamrutam

కాని, దీనియొక్క సత్యాన్ని యెంతవరకు గుర్తించారు? గుర్తించకుండా పోవుటకు కారణము యేమిటి? మనము ఏ విధముగా దీనిని ఆలోచించాలో ఆ విధముగా ఆలోచించక దానికి విరుద్ధమైన మార్గములో అనుభవించటముచేతనే దానియొక్క నిజానందమును అనుభవించలేకపోతున్నాము. ఆనందమును అనుభవించలేకపోవటమే కాకుండా దుఃఖమును అనుభవిస్తున్నాము. కారణమేమిటి? భగవద్గీత పారాయణము చేయటంవలన దుఃఖము ప్రాప్తిస్తుందా? అది పారాయణము చేయవలసినది కాదు. కనుకనే దుఃఖము మనకు ప్రాప్తిస్తుంది. ఆచరణ రూపమైన గ్రంథము, భగవద్గీత. అంతరాత్మతో కూడినది, భగవద్గీత. పరతత్త్వముతో కూడినది, భగవద్గీత. అమృతమైనను మనము కంఠమునందు పోసుకున్నప్పుడే దీనికి తగిన ఫలితమునిస్తుంది కాని అమృతము అమృతమని ముక్కులో పోసుకుంటే ప్రాణము తీస్తుంది. ఈ విధంగా అమృతత్వాన్ని అందించటానికి, మృతికికూడా యీ యొక్క అమృతమే కారణము. ఈ మృతిని యేరీతిగా అందించినది అంటె మనము యీ అమృతాన్ని అనుభవించవలసిన మార్గములో అనుభవించలేదు. కనుకనే ప్రతివిషయముకూడను మానవుడు అనుభవించుటకు పూర్వము చక్కగా విచారణ సల్పి పరిశీలనచేతనే దీనిని ప్రారంభించాలి. ఈ పరిశీలన సలిపినప్పుడే పరిశోధనకూడను మనకు లభ్యమవుతుంది. పరిశీలన, పరిశోధనయొక్క ప్రారంభమే! భగవద్గీతయొక్క తత్త్వాన్ని మనము చక్కగా అర్థము చేసుకొనవలెనన్న దానిని ఆచరణలో పెట్టటానికి మనము ప్రయత్నించాలి.

**భగవంతునికంటె తాను వేరని భావించే వ్యక్తే పిచ్చి పిచ్చి భావములను పెంచుకుంటాడు**

ఈనాడు భగవద్గీతను బోధించే పెద్దలు సరైన సత్యాన్ని గుర్తించుకో లేకపోతున్నారు. ఎన్నో గీతా యజ్ఞ కార్యములు సలుపుతూ వస్తున్నారు. కాని, యివి తాత్కాలికంగా అద్దములో ప్రతిబింబమువలె మనకు ఆనందాన్ని అందిస్తున్నాయే గాని నిజమైన ఆనందాన్ని అందివ్వటములేదు. మన హస్తములో వుండిన పక్షిని వదలి పొదలో వున్న పక్షికోసం ప్రాకులాడటం యెందుకు? 'ఈశావాస్య మిదం సర్వం', 'ఈశ్వరస్సర్వభూతానామ్'. తనయందే ఈశ్వరత్వము వుంది అనే సత్యాన్ని నిజముగా భగవద్గీత బోధించినప్పుడు దీనిని

srisathyasai vahiniamrutam

పూర్తిగా విశ్వసించినవాడైతే భగవంతుడు వేరే వున్నాడనే భావము యితనిలో యేమాత్రము ఆవిర్భవించదు. తనయొక్క ఆత్మతత్త్వమునే కృష్ణునిగా భావించుకొని, తన హృదయమునే బృందావనముగా విశ్వసించుకొని, తన భావములనే గోపికలుగా మార్చుకుని ఆనందమును అనుభవించటానికి ప్రయత్నించటమే నిజమైన సారము. సర్వులయందు దైవము వున్నాడు అనే సత్యమును గుర్తించిన వ్యక్తి తన స్వవిషయము వచ్చేటప్పటికి యీ విశ్వాసము కోల్పోతున్నాడు. పరులకు బోధించే సమయములందు మాత్రము ఈ విషయమును చాలా పటుత్వముగా, బలమైనవిగా వుచ్చరిస్తూ వుంటాము. తనకు ఒకటి, పరులకు మరొకటి వుండటచేత యిది భిన్నముగా కనుపిస్తుంది. తాను వేరుగా దైవము వేరుగా, భావించిన వ్యక్తికే యిట్టి పిచ్చి భావములు ఉద్భవిస్తుంటాయి.

**ఈనాడు భగవద్విషయములు వచ్చేటప్పటికి మానవులు చాలా సంకుచిత భావములు కలిగియుంటున్నారు**

మొట్టమొదట, కౌరవులతో సంధిని కల్గించి, యుద్ధ ప్రమాదమును తప్పించమని కోరినవాడుకూడను అర్జునుడే! "యుద్ధమనగా సామాన్యముగాదు, ఎందరో నిరపరాధులు మృతినొందుతారు. అనేక వంశములు క్షీణిస్తాయి. వర్ణసంకరము యేర్పడుతుంది. కనుక, కృష్ణా! యుద్ధమును తప్పించి లోకక్షేమాన్ని చేకూర్చ"మని ప్రార్థించాడు, అర్జునుడు. అర్జునునియొక్క యిచ్ఛను పురస్కరించుకొని కౌరవుల దగ్గరకు రాయబారిగా వెళ్లాడు కృష్ణుడు. కృష్ణుడుకూడను యీ విధమైన ప్రమాదాన్ని తప్పించాలనే వుద్దేశ్యముతో అనేక విధములుగా తాను సంధికి ప్రయత్నించాడు. కట్టకడపటికి దుర్మార్గులైన దుర్యోధన దుశ్శాసనులు దీనిని అంగీకరించలేదు. ఇది అంగీకరించలేదని తిరిగి కృష్ణుడు వచ్చి అర్జునునితో చెప్పినప్పుడు అందని ద్రాక్షపండ్లు పుల్లన అన్నట్లుగా అప్పుడు అర్జునుడు తిరిగి మార్చుకుంటున్నాడు, తన భావాన్ని. అనగా వ్యక్తులయొక్క భావములు అవసరమైతే ఒక మార్గాన్ని అనుసరిస్తాయి. అవసరం తీరితే మరొక మార్గాన్ని అనుసరిస్తాయి. వారు అంగీకరించివుండిన తాను యెంతయో ఆనందించి వుండేవాడు. కౌరవులు దీనికి అంగీకరించరనే విషయం అర్జునునకుకూడను తెలుసు. కృష్ణుడు వెనుకకు వచ్చినప్పుడు

అర్జునుడు చెప్పుతున్నాడు:

**కాలకూటమున అమృతము సృజింప వీలా**
**భయదావాగ్నిలో మల్లెపూలు వెదజల్లు లీలా**
**ముష్కరుని మ్రోల హితోక్తులు మేలా**
**గుణజాల, ఏల యీ సంధిమాటలిక గోపాలా?**
**కురుచబుద్ధుల కౌరవులరమర తొలగి మన పొత్తు కొత్తురా**
**యుద్ధమునకు సిద్ధమనక కాలహరణ మిక ఏల?**

ఈ కాలహరణం చేసిందెవరు? అర్జునుడు కాదా? తన పాచికలు పారలేదని తాను యుద్ధమునకు సిద్ధము కమ్మని తిరిగి కృష్ణుని పురికొల్పుతూ వచ్చాడు. దీనియొక్క అంతరార్థమేమనగా జీవులయొక్క స్వభావములు యీ పరిస్థితినే పొందుతూవుంటాయి. తనయొక్క స్వార్థ, స్వప్రయోజనముల నిమిత్తమై అనేక విధములైన ప్రయత్నములు సల్పుతూ వుంటారు. అవి ఫలించెనా, యివి నాయొక్క శక్తి సామర్థ్యములంటారు. విఫలమాయెనా, యిది కేవలం దైవానుగ్రహము లోపించటమే, అంటారు. కాని జయించిన దానికి యిది దైవానుగ్రహము అని చెప్పగలడా, చెప్పడు. మానవత్వములో యిట్టి సంకుచితమైన భావములు వుండటంచేతనే యీ విశాలమైన తత్త్వాన్ని తాను గుర్తించుకోలేకపోతున్నాడు. కనుక, ప్రతి విషయంకూడను భగవద్ విషయముగా వచ్చినప్పుడు విశాలము గావించాలి. ఇదియే expansion of Love అన్నారు. క్రమక్రమేణా దానిని సంకుచితమైన మార్గములో ప్రవేశపెట్టటంచేత యిది కేవలము contraction of Love అన్నారు. యీనాడు ప్రాపంచిక విషయములందైనను విశాలమైన భావములను అభివృద్ధి పరచుకుంటున్నారుగాని, దైవసంబంధమైన విషయములు వచ్చేటప్పటికి చాలా సంకుచితమైన మార్గములో, సంకుచితమైన భావములు పెంచుకుంటూ వస్తున్నారు.

**ఈనాడు ఆచరణరూపమైన ప్రచారములు అత్యవసరము**

ప్రేక్షకులయొక్క ఆపేక్షను గుర్తించి ప్రబోధలు సలుపుతున్నారే గానీ, యిది సత్యమైన తత్త్వము అనే భావములో ప్రబోధలు సలిపేవారు చాలా తక్కువ. ప్రజలను వుల్లాసపరచి,

sri sathyasai vachanamrutam

వారిని ఆకర్షించుకొనే విధానమునకు ప్రయత్నిస్తున్నారు. ఇది మరింత భ్రమలలో పడవేస్తున్నది. పెద్దల వాక్యములను శిరసావహించి వాటిని సత్యములనే విశ్వసిస్తున్నారు, ప్రేక్షకులు. ఇవి సరైన బోధలుకావు. మనము చేయవలసినవి ప్రచారములుకాదు, ఆచారములు. చేసి చూపించే విధానములో మనము ప్రయత్నించాలి. చెప్పిన విషయములు మనమే చేయకుండా పోయిన, ప్రజల విశ్వాసమును మనము కోల్పోతాము. ఈనాడు ఆచరణరూపమైన ప్రచారములు అత్యవసరము. ఒక్కొక్క దినమునకు యెన్నియో లక్షల భగవద్గీతలు ప్రింటు అవుతున్నాయి. ప్రతి విదేశీయుడుకూడను భగవద్గీతను వుచ్చరిస్తున్నాడు. దానిని పారాయణము చేస్తున్నారు. కానీ, మానసిక పరివర్తన యేమాత్రముకూడను కలగటంలేదు. ఈ మానసిక పరివర్తనకు మొట్టమొదట భౌతిక పరివర్తన రావాలి. మనిషి అనగా మనసే! మనసు అనగా తలంపులే! తలంపులనగా మనయొక్క నిత్యచర్యలే! ఏతావాతా మనిషి అనగా మన చర్యలే! మొట్టమొదట మన నడవడికను మనము సరిదిద్దుకోవాలి. నడవడికను మనము సరిదిద్దుకుంటే దీనిని అనుసరిస్తుంది మనస్సు. ఈ మానసిక పరివర్తనచేత ఆధ్యాత్మిక పరివర్తనకూడను సంభవిస్తుంది. కాని, భగవద్గీతలో అర్జునుడు ఆ విధముగా చేయలేదు. 'కరిష్యే వచనం తవ'. 'స్వామీ! మీ ఆజ్ఞను శిరసావహించి మీరు చెప్పినట్టుగా చేస్తాను', అన్నాడు. ఈ విశ్వాసమును పురస్కరించుకొనియే కృష్ణుడు చక్కగా కొన్ని గ్లూకోజు, కాల్షియమ్ యింజక్షనులు యిచ్చినట్టుగా ధైర్యమును బోధించి, దీనత్వమును దూరము చేసి, వీరత్వాన్ని అభివృద్ధి పరచి, కర్తవ్యాన్ని ఆచరింపచేశాడు. 'కర్తవ్యం యోగముచ్యతే'. ఈ కర్తవ్యమే మన నిజమైన యోగము. కర్తవ్యమును విస్మరించినవానికి రోగము. కనుక, భగవంతుని తన హృదయములో ప్రతిష్టించుకోవాలి. ప్రతి ఒక్కటి భగవంతుని ప్రబోధలననుసరించియే జరుగుచున్నదనే విశ్వాసాన్ని పెంచుకోవాలి. ఇదే నిజమైన సారథ్యము. పార్థసారథ్యమనగా యేమిటి? పార్థుడనగా పృథ్వీపుత్రుడు, మానవుడే. పార్థ అనగా అర్జునుడు కాదు. పార్థ అనగా పృథ్వీపుత్రుడు. కాబట్టి అందరూకూడను పృథ్వీపుత్రులే! కాబట్టి, ప్రతి వ్యక్తికికూడను తాను పార్థియే! కనుక, నాయొక్క జీవితమునకు భగవంతుడే సారథ్యము వహించాలని ప్రార్థించాలి. అప్పుడు భగవంతుని చేతిలో నీవు ఒక పనిముట్టుగా తయారౌతావు. ఈ

srisathyasaivahini.org

పనిముట్టును ఉపయోగించే కర్తగా తాను నిరూపిస్తాడు. నీ యిచ్ఛలను, నీ భావములను, నీ సంకల్పములను, నీ దురుద్దేశములను యిందులో యేమాత్రము ప్రవేశపెట్టకూడదు. అట్టి ఆజ్ఞను శిరసావహించాడు అర్జునుడు. అప్పుడే భగవంతుడైన కృష్ణుడు అర్జునునికి అభయాన్ని యిచ్చాడు:

**మన్మనా భవ మద్భక్తో మద్యాజీ మాం నమస్కురు**
**మామే వైష్యసి యుక్త్వైవ మాత్మానం మత్పరాయణః**

"యిప్పుడు నీవు నాకు భక్తుడవు", అన్నాడు. అనగా, ఆజ్ఞను శిరసావహించటమే భక్తికి సరైన ప్రమాణము. కానీ, యీనాటి మానవునకు మాటయొక్క విలువ యేమాత్రము తెలియదు.

**భగవంతుడు ఏమి చేసినా మన మంచికొరకే!**

ప్రేమస్వరూపులారా! మాటకు ఖర్చు తక్కువ, విలువ యెక్కువ. మాట విలువ తెలియనివాడు మనిషి విలువ యేరీతిగా తెలుసుకొనగలడు? దైవముయొక్క వాక్కు నిస్వార్థమైనది. దైవము యేది చెప్పినా, యేది చూచినా, యేది పలికినా అన్నీకూడను మీ మంచి నిమిత్తమే! God does everything good for you. ఈ సత్యమును మనము విశ్వసించాలి. అప్పుడే యీ విధమైన సాధనలు మనము సాధించటానికి వీలవుతుంది. తనకు కావలసినది యీ జగత్తులో యేమీ లేదు. తాను చేయవలసినది యీ జగత్తునందు యేమీ లేదు. సంకల్పమాత్రమున సర్వము తాను సాధించగలడు. ఈ విషయాన్నే కృష్ణ పరమాత్మ భగవద్గీతలో

**సమే పార్థాస్తి కర్తవ్యం త్రిషులోకేషు కించన**
**నాన వాప్త మవాప్తవ్యం వర్తఏవచ కర్మణి**

"నేను యీ త్రిలోకములందు పొందవలసినది యేమీ లేదు. నేను చేయవలసినది యేమీ లేదు. నేను అనుభవించవలసినదికూడా యేమీ లేదు. నేను చేసే ప్రతికర్మకూడను మీ నిమిత్తమై చేస్తున్నాను" అని చెప్పాడు. ఈ సత్యాన్ని మనము విశ్వసించాలి. భగవద్గీతను

sri sathyasai vachanamrutam

చదువుతున్నాము 700 శ్లోకములు కంఠస్థము చేసుకున్నాము. కాని, ఆ ఏడువందల శ్లోకములలో యేమిటుందో మనకు అర్థము కావటంలేదు. ఈ భగవద్గీత సారాన్ని మనము గుర్తించాలంటే రెండింటిని ఆధారముగా తీసుకుంటే చాలు. కొందరు భగవద్గీత భక్తిని బోధిస్తుంది అంటారు. కొందరు ధర్మమును బోధిస్తుంది అంటారు. కొందరు కర్మను బోధిస్తుంది అంటారు. కొందరు మోక్షాన్ని అనుభవింప జేస్తుంది అంటున్నారు. ఈ వ్యాఖ్యాతలు వారివారి తెలివితేటలను పురస్కరించుకొని అనేక విధములుగా దీనికి వ్యాఖ్యానము చేస్తూ వస్తున్నారు. ఈ వ్యాఖ్యానములలోపల కృష్ణుని వాక్యము యెక్కడ జారిపోయిందో జారిపోయింది. ఈ నానార్థములు పెంచటములోపల అసలు యథార్థముపోయి అనర్థాలు బలిసిపోతున్నాయి. భగవద్గీతలో మొట్టమొదటి శ్లోకము

**ధర్మక్షేత్రే కురుక్షేత్రే సమవేతా యుయుత్సవః**
**మామకాః పాణ్డవాశ్చైవ కిమకుర్వత సఞ్జయ**

ఈ మొట్టమొదటి శ్లోకములో మొట్టమొదటి పదము యేమిటి? 'ధర్మము'. ఇక కట్టకడపటి శ్లోకము

**యత్ర యోగేశ్వరః కృష్ణో యత్ర పార్థో ధనుర్ధరః**
**తత్ర శ్రీర్విజయో భూతిర్ధ్రువా నీతిర్మతిర్మమ**

ఈ కడపటి శ్లోకములో కట్టకడపటి పదము 'మమ'. ఈ 'మమ', ఆ మొదటి శ్లోకములో వుండిన మొదటి పదము 'ధర్మ', రెండింటిని చేరుస్తే 'మమధర్మ' అని బోధిస్తుండాది. ఎవరు ఏ రీతిగా ధర్మము నాచరించాలి అనేది మనము గుర్తించుకోటానికి ప్రయత్నించాలి.

**సర్వకర్మలు భగవత్ప్రీతికొరకు అని ఆచరించటమే సరియైన ధర్మము**

అందరికి ఒకే ధర్మము చెల్లదు. ఒకడు బ్రహ్మచారిగా వుంటాడు, మరొకడు గృహస్థుడుగా వుంటాడు, ఒకడు వానప్రస్తుడుగా వుంటాడు, మరొకడు సన్యాసిగా వుంటాడు. వారి వారి స్థాయికి తగిన ధర్మములు ప్రత్యేకముగా వున్నాయి. ఇంతే కాదు,

sri sathyasai vahini vacharamrutam

ఒకడు విద్యార్థిగా వుండవచ్చు. ఒకరు వ్యవసాయదారుడుగా వుండవచ్చు. మరొకడు వ్యాపారిగా వుండవచ్చు. వీరి ధర్మాలుకూడా ప్రత్యేకముగా వుంటున్నాయి. ఒకరు స్త్రీగా వుండవచ్చును. మరొకడు పురుషుడుగా వుండవచ్చును. వీరి ధర్మములుకూడను ప్రత్యేకముగా వుంటాయి. ఈ స్త్రీలయందుకూడను గృహిణిగా ఒకరు వుండవచ్చును. కన్యగా మరొకరు వుండవచ్చును. వీరి ధర్మములుకూడా ప్రత్యేకముగా వుంటాయి. కనుక, ధర్మము అనేది అందరికి సమానముగా భావించటమనేది వెఱ్ఱితనము. తమయొక్క స్థితిని, మతిని, గతి, మతులను విచారించుకోటము చాలా కష్టమైన విషయము. దీనికి సులభమైన మార్గము, 'సర్వకర్మభగవత్ ప్రీత్యర్థము'గా ఆచరించటమే! 'స్వామీ! సర్వము నీకు అర్పితము చేస్తున్నాను. నేను యేమి చేసినప్పటికి నీవు చేయించేదే!' అనే శరణాగతి భావముతో చేస్తే ధర్మము చాలా సులభముగా యేర్పడుతుంది. హృదయము మారాలి, పలుకులు మారకూడదు. భగవద్గీతను కేవలము పారాయణ చేయకూడదు, ఆచరణలో మనము నిరూపించాలి. ఈ సత్యాన్ని మనము ప్రయత్నపూర్వకముగా సాధించాలి. తట్టలో పంచభక్ష్యపరమాన్నములు పెట్టుకొని పంచభక్ష్యపరమాన్నము, పంచభక్ష్యపరమాన్నం అని వెయ్యితూర్లు వుచ్చరించినా నీ కడుపునిండుతుందా? నిండదు. నీవు వుచ్చరించనక్కరలేదు, చేత్తో తీసుకొని నోటికి పనిపెట్టుచాలు. కడుపు నిండుతుంది. నీ నోటికి, చేతికి పని పెట్టటమే కర్మాచరణ! కనుక ఆచరణలో నీకు ఆనందము కనుపిస్తుంది కానీ పారాయణములో నీకు ఆనందము కనుపించదు. ఇదే భగవద్గీతయొక్క ప్రధానమైన ప్రమాణము, ప్రాణము.

**(తేదీ 09-10-1986న భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam